# కురుమూర్తికి పోటెత్తిన భక్తులు



కురుమూర్తి స్వామి దర్శనం కోసం బారులు తీరిన భక్తులు



గర్భ గుడి వద్ద స్వామివారి దర్శనానికి బారులు తీరిన భక్తులు





కురుమూర్తి స్వామి మూలవిరాట్

దేవరకద్ర రూరల్ (చిన్నచింతకుంట) డిసెంబర్ 2: పాలమూరు జిల్లాలోని చిన్నచింతకుంట మండలం అమ్మాపూర్ గ్రామ సమీపంలోని సప్త గిరులలోని కాంచన గుహలో కొలువైన స్వయంభూ వేంకటేశ్వరస్వామి ప్రతిరూపమైన కురుమూర్తిరాయుడి బ్రహ్మోత్సవాలు కనుల పండువగా కొనసాగుతున్నాయి. కార్తీకమాసం శనివారం పర్వదినాన్ని పురస్కరించుకొని భక్తులు పెద్దఎత్తున కురుమూర్తి కొండకు తరలివచ్చారు. భక్తిశ్రద్ధలతో పుణ్యస్నానాలు ఆచరించి స్వామివారికి నైవేద్యాన్ని సమర్పించారు. దాసంగాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

## నేడు ఉమ్మడి జిల్లా అథ్లెటిక్స్ జట్ల ఎంపికలు

మహబూబ్‌నగర్ టౌన్, డిసెంబర్ 2 : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఆదివారం అండర్-14, 17 ఉమ్మడి జిల్లా బాలబాలికల అథ్లెటిక్స్ జట్ల ఎంపికలను నిర్వహిస్తున్నట్లు ఎస్‌జీఎఫ్ సెక్రటరీ రమేశ్‌బాబు ప్రకటనలో తెలిపారు. ఉదయం 9గంటలకు స్టేడియం మైదానంలో ఎంపికలు ఉంటాయని పేర్కొన్నారు. ఐదు జిల్లాల క్రీడాకారులు బోనఫైడ్‌తో హాజరుకావాలన్నారు. మరింత సమాచారం కోసం 9440160104, 9849706360 నంబర్లను సంప్రందించాలని కోరారు.

# జూరాలకు స్వల్ప వరద

ధరూరు, డిసెంబర్ 2 : ప్రియదర్శిని జూరాల ప్రాజెక్ట్‌కు స్వల్పంగ వరద ఎగువ నుంచి వస్తున్నది. 2,091 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా, 1,235 క్యూసెక్కుల అవుట్‌ఫ్లో ఉన్నది. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 7.682 టీఎంసీలకు గానూ 3.975 టీఎంసీల నీటిమట్టం ప్రాజెక్ట్‌లో నిల్వ ఉంది. కోయిల్‌సాగర్‌కు 315 క్యూసెక్కులు, ఎడమ కాల్వకు 390 క్యూసెక్కులు, కుడి కాల్వకు 442 క్యూసెక్కులు, ఆర్డీఎస్ లింక్ కెనాల్‌కు 300 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

**ఆర్డీఎస్ ఆనకట్టకు స్థిరంగా వరద**

అయిజ, డిసెంబర్ 2 : కర్ణాటకలోని ఆర్డీఎస్ ఆనకట్టకు వరద నిలకడగా కొనసాగుతోంది. శనివారం ఆర్డీఎస్ ఆనకట్టకు 4,329 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా, ఆనకట్టపై నుంచి దిగువన ఉన్న సుంకేసుల బ్యారేజీకి 3,800 క్యూసెక్కులు చేరుతున్నాయి. ఆర్డీఎస్ ప్రధాన కాల్వకు 529 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం ఆర్డీఎస్ ఆనకట్టలో 8.6 అడుగుల మేర నీటిమట్టం ఉన్నట్లు ఆర్డీఎస్ ఈఈ విజయ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. తుమ్మిళ్ల పథకం పంప్ ద్వారా నీటి విడుదల కొనసాగుతుందని పేర్కొన్నారు.

**టీబీ డ్యాంకు వరద..**

కర్ణాటకలోని తుంగభద్ర డ్యాంకు వరద కొనసాగుతోంది. 815 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా, 3,322 క్యూసెక్కుల అవుట్‌ఫ్లో నమోదైంది. 105.788 టీఎంసీల పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం కలిగిన డ్యాంలో ప్రస్తుతం 13.434 టీఎంసీల నీటి నిల్వ ఉన్నది. 1,633 అడుగుల గరిష్ట నీటి మట్టానికి గానూ ప్రస్తుతం 1592.70 అడుగుల నీటిమట్టం ఉన్నట్లు డ్యాం సెక్షన్ అధికారి రాఘవేంద్ర తెలిపారు.



ఆర్డీఎస్ ఆనకట్టపై పారుతున్న వరద

## జాతీయ వ్యవసాయ విద్యా దినోత్సవం




వ్యవసాయ కళాశాలను సందర్శించిన విద్యార్థులు

బిజినేపల్లి, డిసెంబర్ 2 : మండలంలోని పాలెం వ్యవసాయ కళాశాలలో శనివారం భారతరత్న డాక్టర్ రాజేంద్రప్రసాద్ జయంతిని పురస్కరించుకొని జాతీయ వ్యవసాయ విద్యాదినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన 9,10వ తరగతి విద్యార్థులు వ్యవసాయ కళాశాలను సందర్శించారు. ఈ సందర్భంగా కళాశాల అసోసియేషన్ డీన్ పుష్పవతి మాట్లాడుతూ వ్యవసాయానికి సంబంధించిన సాంకేతిక విజ్ఞానాన్ని విద్యార్థులకు వివరించారు. కళాశాల ల్యాబ్‌లను, పంటలను, వివిధ విత్తనోత్పత్తి క్షేత్రాలను విద్యార్థులకు చూపించారు. కార్యక్రమంలో సిద్ధప్ప, చరణ్‌తేజ్, సత్యనారాయణ, సుమలత, నిమా, అర్చన, శ్రీరామ్, భానుశ్రీ, సాధన, రాజు, రాఘవేంద్రరెడ్డి ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## జోగుళాంబ అమ్మవారికి మంత్రి పూజలు



ఆలయంలో మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి కుటుంబ సభ్యులు

అలంపూర్, డిసెంబర్ 2 : ప్రజలకు సేవ చేసే భాగ్యం మరోసారి ప్రసాదించు తల్లీ అంటూ జోగుళాంబ దేవీని వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి వేడుకున్నారు. దక్షిణ కాశీ ఆలంపూర్ జోగుళాంబ బాలబ్రహ్మేశ్వర స్వామి ఆలయాలను కార్తీకమాసం సందర్భంగా మంత్రి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. అంతకు ముందు వారికి ఆలయ పాలక మండలి చైర్మన్ చిన్న కృష్ణయ్యనాయడు, ఈవో పురేందర్‌కుమార్, అర్చకులతో కలిసి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. స్వామివారి ఆలయంలో అభిషేకం, అమ్మవారి ఆలయంలో అర్చనలు తదితర పూజా కార్యక్రమాలు చేశారు. అనంతరం అర్చకులు మంత్రిని ఆశీర్వదించారు. కార్యక్రమంలో మంత్రి కుమార్తె తేజశ్విని, బీఆర్ఎస్ వనపర్తి జిల్లా అధ్యక్షుడు గట్టుయాదవ్ కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# కరుణించమ్మా మైసమ్మ తల్లి

- ముగిసిన మైసిగండి అమ్మవారి జాతర

కడ్తాల్, డిసెంబర్ 2 : జిల్లాలో ప్రసిద్ధిగాంచిన మైసిగం డి మైసమ్మతల్లి జాతర ఉత్సవాలు శనివారం ముగిశాయి. ఉత్సవాల్లో భాగంగా శనివారం చివరిరోజు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా అమ్మవారిని వివిధ రకాల కూరగాయలతో ప్రత్యేక అలంకరణ చేశారు. ఉత్సవాలకు చివరిరోజు కావడంతో భక్తు లు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో ఆలయ ట్రస్టీ శిరోలీపంతూనాయక్, ఈవో స్నేహలత, నిర్వాహకులు భాస్కర్‌నాయక్, అరుణ్‌కుమార్, అర్చక సిబ్బంది యాదగిరిస్వామి, బోడియానాయక్, రాములు, కృష్ణ, చంద్రయ్య, దేవేందర్, కృష్ణ, రమాదేవి, హర్షవర్ధన్, శ్రీనివాస్, విజయ్‌గౌడ్, రామకృష్ణ, మహేశ్‌గౌడ్, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.



మైసమ్మతల్లిని దర్శించుకుంటున్న భక్తులు

## ఆర్ఎన్ఆర్@3,161

జడ్చర్ల, డిసెంబర్ 2 : బాదేపల్లి వ్యవసాయ మార్కెట్‌లో ధాన్యం ధరలు రోజురోజుకూ పెరుగుతూనే ఉన్నాయి. బాదేపల్లి వ్యవసాయ మార్కెట్‌లో శనివారం ఆర్ఎన్ఆర్ రకం ధాన్యానికి క్వింటా రూ.3,161 ధర పలికింది. శనివారం మార్కెట్‌కు ధాన్యం, మొక్కజొన్న, పత్తి అమ్మకానికి వచ్చాయి. 14,574క్వింటాళ్ల ఆర్ఎన్ఆర్ రకం ధాన్యం అమ్మకానికి రాగా, క్వింటాల్‌కు గరిష్ఠంగా రూ.3,161 ధర రాగా, కనిష్ఠంగా రూ.1,889, మధ్యస్తంగా రూ.2,976 ధర పలికింది. అదేవిధంగా 83క్వింటాళ్ల మొక్కజొన్న అమ్మకానికి రాగా, క్వింటాల్‌కు గరిష్ఠంగా రూ.2,339, కనిష్ఠంగా రూ.2,251, మధ్యస్తంగా రూ.2,331ధర పలికింది. అదేవిధంగా 338 క్వింటాళ్ల హంసధాన్యం అమ్మకానికి రాగా, క్వింటాల్‌కు గరిష్ఠంగా రూ.1,968 ధర పలికింది. 307 క్వింటాళ్ల పత్తి అమ్మకానికి రాగా, క్వింటాల్‌కు గరిష్ఠంగా రూ.6,950 ధర పలికింది.



బాదేపల్లి వ్యవసాయ మార్కెట్‌కు అమ్మకానికి వచ్చిన ధాన్యం